క్లుప్తంగా

బీమా సౌకర్యం కల్పిస్తాం..

పాల్వంచరూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లతో ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్లకు పోస్ట్ ఆఫీసు ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పారండ్ల రంగా, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వీరన్న, సబ్‌పోస్ట్ మాస్టర్ నాగమనీషా పాల్గొన్నారు.

జీతాల్లో కోత విధించొద్దు

సింగరేణి(కొత్తగూడెం): వరద బాధితుల సహాయ నిధి కోసం కార్మికుల అనుమతి పొందిన తరువాతే కార్మికుల జీతం నుంచి కోత విధించాలని గురువారం ఏజీఎం పర్సనల్ (ఆర్‌వింగ్) అజయ్‌కుమార్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికుల అనుమతి లేకుండా డబ్బులు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయండి..

పాల్వంచరూరల్: ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయకపోవడం వలన ఎస్సీ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతోందని వెంటనే నిధులు మంజూరు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను గురువారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించుకున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ తెలిపారు. ఈ మేరకు ఫోన్‌లో వివరాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపించిన అణగారిన వర్గాల ప్రజలకు ప్రజాపాలన ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చిన్న తరహా పాడి పరిశ్రమలు, గేదెలు, గొర్రెలు, మేకలు, వ్యవసాయ బోరు బావులు, వ్యవసాయ పనిముట్లు, చర్మకారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక


మోతీలాల్, రమేష్‌బాబు

టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూ టేకులపల్లి మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా గుగులోత్ మోతీలాల్, ప్రధాన కార్యదర్శిగా బి.రమేష్ బాబు, గౌరవ అధ్యక్షుడిగా బి.సైదులు, ఉపాధ్యక్షుడిగా బాబా షఫీయుద్దీన్, ఎం.రమణ, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.బాలు, మహిళా అధ్యక్షురాలిగా బి.హరిప్రియ, మహిళా కార్యదర్శిగా జే.పద్మ, కార్యవర్గ సభ్యులుగా బి.లోక్య, టి.బాలాజీ, బి.మంగూలాల్, పి.రామకళ, జి.రాందాస్, సీహెచ్ మురళీధర్‌లను ఎన్నుకున్నారు.

ప్రభుత్వం ఇళ్ల స్థలాలివ్వాలి

టేకులపల్లి: నెల జీతాలపై ఆధారపడి జీవిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సొంతింటి కల నెరవేరడం లేదని, వారి ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. దసరా కానుకగా మూడు డీఏలు, 40 శాతం ఫిట్‌మెంట్ కూడిన పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు.

వేతనాలు విడుదల

ఇల్లెందు: వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇఫ్టూ ప్రాతినిధ్యంతో పెండింగ్ వేతనాలు విడుదలైనట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, షేక్ యాకుబ్‌షావలీ తెలిపారు. గురువారం ఇల్లెందులో మాట్లాడుతూ... ఏడు నెలలుగా బడ్జెట్ లేకపోవటం వల్ల వేతనాలు అందలేదన్నారు. పలుమార్లు ఆస్పత్రి సూపరింటెండెంట్లకు, డీసీహెచ్‌ఎస్ దృష్టికి తీసుకురాగా కాంట్రాక్టర్‌తో చర్చించి వేతనాలు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పెండింగ్‌లో వేతనాలు విడుదల కావటం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటరు జాబితాపై సమీక్ష

రాజకీయ పార్టీల నాయకులతో అధికారుల సమావేశం


జూలూరుపాడు: పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా సిద్ధం చేసిన ఫొటో ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రాజకీయ నాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఓటర్ల తొలగింపు అంశం తమ పరిధిలో ఉండదని చెప్పారు. సీపీఎం నేత అబ్దుల్ నబీ అన్ని రాజకీయ పక్షాలకు ఓటరు జాబితాను అందజేయాలని కోరారు. సుభాష్‌నగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీలను ప్రధాన రహదారి సరిహద్దుగా విభజించాలని, ఈ ప్రక్రియ ఎన్నికలకు ముందు చేపడితేనే ఓటర్ల సర్దుబాటుకు అవకాశం ఉంటుందని బీఆర్‌ఎస్ నేత దాస్యం ప్రమోద్ సూచించారు. పోలారం గ్రామపంచాయతీలో ఒక గ్రామంలోని వార్డు ఓటర్లను మరో గ్రామ వార్డులో కలిపారని, ఇదే విషయమై సంబంధిత కార్యదర్శికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోయారు.

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీ లోపు పంచాయతీ సెక్రటరీలకు లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, బీఆర్‌ఎస్ నాయకులు చావా వెంకటరామారావు, టీడీపీ నాయకులు రోకటి నరసింహారావు, చలమల గోవిందు, కాంగ్రెస్ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, గోపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలలో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రచురించడం జరిగిందని అభ్యంతరాలు ఉంటే 21వ తేదీ నాటికి తెలియజేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి రాజకీయ పార్టీల నాయకులను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో ఒకే కుటుంబానికి సంబంధించిన సభ్యులందరూ ఒకే వార్డులో ఉండే విధంగా ఓటర్ల జాబితాను తయారు చేయడం జరిగిందని చెప్పారు.


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

లాభాల్లో కార్మికులకు వాటా ఇవ్వండి..


సింగరేణి(కొత్తగూడెం): జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియాలలోని జీఎం, హెడ్డాఫీసుల ఎదుట గురువారం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆయా హెచ్‌ఓడీలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ 2023–24 వార్షిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిందని, వాటిలో వచ్చిన లాభాలను వెల్లడించటంలో, కార్మికులకు వాటా చెల్లింపులో జాప్యం చేస్తోందని, వెంటనే నికర లాభాలను ప్రకటించి వాటిలో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఓపికను పరీక్షించకుండా ఈ నెలాఖరు లోపు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, వసికర్ల కిరణ్‌కుమార్, కాగితపు విజయ్‌కుమార్, రాసూరి శంకర్, బుర్గుల రవికుమార్, కంచర్ల శ్రీనివాస్, అశోక్, డి.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఆర్.గణేష్, తిరుపతి, సూరజ్, సూర్యనారాయణ, అరుణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణిలో లాభాల వాటా 35శాతం ప్రకటించాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేసింది. గురువారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఎస్‌ఓటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ.. 2023–24లో సింగరేణి సాధించిన లాభాల్లో ఉద్యోగులకు వాటా ప్రకటించకపోవటం దురదృష్టకరం అన్నారు. ఈ కార్యక్రమంలో దిండిగల రాజేందర్, ఎస్.రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, జేకే శ్రీనివాస్, నెమలి ధనమ్మ, జబ్బార్, గిన్నారపు రాజేష్ పాల్గొన్నారు.

మళ్లీ రిటైర్డ్ ఉద్యోగికే సబ్‌స్టేషన్ బాధ్యతలా?

పాల్వంచరూరల్: నాగారం సబ్‌స్టేషన్ ఆపరేటర్ బాధ్యతలు మళ్లీ మరో రిటైర్డ్ ఉద్యోగికే అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఉద్యోగి సారయ్య బుధవారం లైన్‌క్లియర్ (ఎల్‌సీ) ఇవ్వడంలో జాప్యం చేసిన కారణంగా ఏఎల్‌ఎం రామకృష్ణ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజు వేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై ఏడీఈ, ఏఈలు విచారణ జరిపి ఆపరేటర్ సారయ్య బాధ్యుడని తేలడంతో అతడిని వెంటనే తొలగించారు. అయితే ఆ స్థానంలో మరో రిటైర్డ్ ఉద్యోగి కిషన్‌కు గురువారం సబ్‌స్టేషన్ ఆపరేటర్ బాధ్యతలు అప్పగించారు.

ఈ విషయమై ఏడీఈ లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. మండలంలోని మూడు సబ్‌స్టేషన్లలో ఆరుగురు రిటైర్డ్ ఉద్యోగులే ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారని రెగ్యులర్ ఆపరేటర్ పోస్టులు భర్తీ అయ్యే వరకు వారితోనే నడిపిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డ్రైవర్లు

జూలూరుపాడు: ఈనెల 22,23వ తేదీల్లో కొత్తగూడెంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు.

గురువారం జూలూరుపాడులో ఆటోడ్రైవర్లతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆటోడ్రైవర్లకు రూ 12,000 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర మహాసభలకు ఆటో, క్యాబ్, ప్రైవేట్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జక్కుల రాములు, హనుమంతరావు, బత్తుల సత్యనారాయణ, ఎస్‌కే నాగుల్ మీరా, ఎస్‌కే చాంద్‌పాషా, గార్లపాటి శివకృష్ణ, నిమ్మటూరి లక్ష్మయ్య, పత్తిపాటి మహేష్, బాపట్ల పూర్ణచందర్‌రావు, వల్లమల్ల సామేలు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

కొత్తగూడెంటౌన్: రైతులకు రుణమాఫీ చేయడం లేదని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకులను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు గురువారం తెల్లవారు జామున ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టయిన వారిలో శ్రీధర్‌యాదవ్, బానోతు శ్రీనివాస్, లక్ష్మణ్ నాయక్, లెనిన్, జాన్ ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కొత్తగూడెంఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలు, వార్డులలో అమ్మ పేరున ఒక చెట్టు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం, సింగరేణి ఉమెన్స్ కళాశాల, సింగరేణి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నాటిన మొక్కలను కాపాడుతూ చెట్లు అయ్యే వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వీరభద్రచారి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: సాయిరాంతండా గ్రామ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... కొత్తగూడెం వెళ్తున్న లారీని ఆటో ఓవర్ టేక్ చేస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఇదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న మరో ఆటో డ్రైవర్ శ్రీకాంత్ 108కి సమాచారం ఇచ్చాడు. క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడ్డవారు వికారాబాద్ జిల్లా లింగన్నపాలెంకు చెందిన బాబాయి, కొడుకు కృష్ణయ్య, శ్రీను అని తెలిసింది. వీరు క్యాటరింగ్ పని ముగించుకొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

చట్టబద్ధ హక్కులు కల్పించండి..


మాట్లాడుతున్న సీతారామయ్య

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అసంఘటితరంగ కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని, మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న చలో హైదరాబాద్‌కు భారీ సంఖ్యలో తరలిరావాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికవర్గం మనుగడకు అత్యంత ప్రమాదకరంగా ఉందని, కార్పొరేట్ సంస్థలు యాజమానులు కార్మికుల శ్రమను ఇష్టారాజ్యంగా దోచుకునేందుకు తోడ్పడుతున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రశ్నించే అవకాశం లేకుండా నోళ్లు మూయించి నేరచట్టాలను వ్యతిరేకించాలన్నారు. పలు సమస్యల పరిష్కారానికి జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రావూరి ఉపేందర్‌రావు, గట్టయ్య, సంజీవరావు, కాపు కృష్ణ, రమేష్, శ్రీనివాస్, మంచ నర్సింగ్, గోపాలరావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము, ధూళిని నివారించాలి


నిరసన తెలియజేస్తున్న స్థానికులు

టేకులపల్లి: దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సింగరేణి, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని దాసు తండా, రేగులతండా ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు ప్రధాన రహదారిపై కర్రలు, రాళ్లు అడ్డుగా పెట్టి నిరసన తెలియజేశారు. కేటీసీ నుంచి ప్రతీరోజు వందల సంఖ్యలో బొగ్గు లోడుతో లారీలు, టిప్పర్లు వస్తున్నాయని, రోడ్లపై గుంతలు పడడంతోపాటు బొగ్గు పెళ్లలు రోడ్లపై పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్లు శుభ్రం చేయకపోవడం లారీలు, టిప్పర్ల అతివేగం కారణంగా దుమ్ము, ధూళితో శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నా సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్లపై దుమ్ము, ధూళి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం ఆర్టిజన్లను ఆదుకోవాలి

పాల్వంచ: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేసి ఏపీఎస్‌ఈబీ నిబంధనలు వర్తింపజేయాలని ఆర్టిజన్ జేఏసీ నాయకులు కోరారు. గురువారం స్థానిక టీజీ యూఈఈయూ (సీఐటీయూ) కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ రంగంలో 23వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని చెప్పి, నాటకీయ పరిణామంలో ఆర్టిజన్‌లుగా చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అన్ని కార్మిక సంఘాలకు చెందిన కార్మికులతో టీవీఏసీ జేఏసీని ప్రకటించడం జరిగిందన్నారు. జేఏసీ చైర్మన్ నర్సింహారెడ్డి, త్రినాథ్, రాములు, రమేష్, బి.శంకర్ పాల్గొన్నారు.

22న అరుణోదయ జిల్లా కౌన్సిల్


మాట్లాడుతున్న సురేష్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 22న కొత్తగూడెంలో జరగనున్న అరుణోదయ జిల్లా కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు వీరమల్ల సురేష్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కళాకారులు పాలకులకు అమ్ముడుపోతున్న సందర్భంలో ప్రజాకళలు, సాహిత్యం వర్ధిల్లాలని ఆదివాసీ, గిరిజన, పీడిత ప్రజల పక్షాన నిలబడుతూ ప్రజాపోరాటాలకు అండగా ఆటపాటలు కళారూపాలను ప్రదర్శిస్తున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ కౌన్సిల్ ఏర్పాటు చేశామన్నారు.

అరుణోదయ సాంస్కృతి సమాఖ్య ప్రజాపక్షపాతి అని, నిరంతరం ప్రజా ఉద్యమాల వెంట ప్రజాకళలను పదర్శిస్తూ అనేక త్యాగాలు చేసిందన్నారు. గరికపాటి రాజారావు, సుబ్బారావు, పాణిగ్రాహి కానూరి వెంకటేశ్వరరావు, అరుణోదయ రామారావు, తదితర నాయకులు కళారంగంలో విశేషంగా కృషి చేసి ప్రజాకళాకారులుగా జీవించారన్నారు. ఈ సమావేశంలో ఎండీ అలీమొద్దీన్, మారుతీరావు, రఘుకుమార్, అఖిల్, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ మండలి బోర్డును ప్రక్షాళన చేయండి


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోరాడి సాధించుకున్న తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును ప్రక్షాళన చేయాలని బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శేష గిరిభవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేర్పుల మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ మండలిని కార్మిక సంఘాల ప్రతినిధులతో పాలకమండలిని నియమించాలని సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌కే సాబీర్‌పాషా, కంచర్ల జమలయ్య, ఎస్.ప్రసాద్, పి.కోటేశ్వరరావు, సీతారాములు, కృష్ణ, సురేందర్‌రెడ్డి, నరసింహారావు, జిన్నా, మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సీడీపీఓ అరుణకుమారి


జూలూరుపాడు: చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం


పాల్వంచరూరల్: వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

ఇల్లెందురూరల్: పోషకాహారం తీసుకుంటే వారి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి అన్నారు. మండలంలోని మేడికుంట, రాఘబోయినగూడెం సెక్టార్ లెనిన్‌నగర్, రొంపేడు సెక్టార్ మేడికుంట గ్రామాలలో గురువారం పోషణమాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు సంప్రదాయ పద్ధతిలో సీమంతం చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇంటి వద్ద పోషకాహారం తయారు చేసుకునే విధానానంపై సమగ్రంగా అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి బయటపడతారని పేర్కొన్నారు. తద్వారా తాము ఆరోగ్యంగా ఉండటంతోపాటు ఆరోగ్యవంతులైన బిడ్డలకు జన్మనిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కొమరమ్మ, జ్యోతి, చైల్డ్‌లైన్ సారిక, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

రోజువారీగా సులువైన పద్ధతులలో వ్యాయామం చేస్తే గర్భిణులకు ప్రసవ సమయంలో మేలు చేస్తుందని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని బొంబాయి తండా హెల్త్ సబ్‌సెంటర్‌లో గురువారం అమ్మ కోసం క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జూలూరుపాడు: తల్లీబిడ్డలు పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ సలోమి అన్నారు. పోషణ్ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా గురువారం కాకర్ల అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లీబిడ్డలకు పోషకాహారమే శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, శకుంతల, సఖీ కోఆర్డినేటర్ సంతోష రూప, టీచర్లు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గర్భిణులు వ్యాయామం చేయడం వలన ఆపరేషన్ లేకుండా వందశాతం సాధారణ డెలివరీ కావచ్చని జగన్నాథపురం పీహెచ్‌సీ డాక్టర్ రాజు అన్నారు. మండల పరిధి పెద్దమ్మ గుడి వద్ద గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం గర్భిణులకు ఆరోగ్య విద్యాబోధన చేశారు. గర్భిణులు తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ఒత్తిడికి లోనుకాకుండా మంచి వాతావరణం కల్పించడం అవసరం, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవాలని సూచించారు.

జోనల్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం


విద్యార్థులతో చైర్మన్ డీవీ, జీఎం జాన్‌ఆనంద్, ఎంఈఓ తదితరులు

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్, ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. తొలిరోజు బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ నిర్వహించారు.

భారీగా వసూలు..?

ఇల్లెందు మండల, జోనల్ స్థాయి పాఠశాలల క్రీడాపోటీల నిర్వహణ పేరుతో నిర్వాహణ కమిటీ నిధులు వసూలు చేసింది. సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసినప్పటికీ తగిన ఏర్పాట్లు చేయలేదు. ఆహారంలో నాణ్యత లోపించటం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. దీనిపై విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ విషయమై మండల క్రీడా కన్వీనర్ రాంబాబు, ఎంఈఓ కృష్ణయ్యను వివరణ కోరగా.. నిధులు సేకరించామని వాటితో విజేతలకు ఇచ్చే ధ్రువపత్రాలు, షీల్డుల ఖర్చులకు ఉపయోగిస్తామని తెలిపారు. దుర్వినియోగం జరిగే అవకాశం లేదని, ప్రతీ పైసాకు జవాబుదారీగా ఉంటామని చెప్పారు.

నామమాత్రపు సౌకర్యాలతో..

ఇల్లెందురూరల్: జోనల్ క్రీడా పోటీలలో సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ ఆరోపించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణంలో కోర్టులు వేయలేదని, కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారని, మండుటెండలోనే భోజనం చేయాల్సి వచ్చిందన్నారు. క్రీడల నిర్వహణ పేరిట సేకరించిన నిధులను ఏం చేశారని ప్రశ్నించారు. క్రీడల నిర్వహణ తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

టేకులపల్లి: మండల స్థాయి అండర్ 14, అండర్ 17 పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. గురువారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలను మండల విద్యాశాఖ అధికారి ఠాకూర్ రాంసింగ్ ప్రారంభించారు. జిల్లా స్థాయికి విద్యార్థులను ఎంపిక చేశారు. శుక్రవారం బాలికలకు క్రీడా పోటీలు ఉంటాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.